1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | డిసెంబర్ 05, 2024 | www.navatelangana.com

కబ్జా చేస్తున్న ప్రభుత్వ భూమిని అడ్డుకున్న కాలనీవాసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని వార్డు నంబర్ 12 పరిధిలో న్యూహౌజింగ్ బోర్డులో గల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. కాలనీవాసులు అడ్డుకొని కౌన్సిలర్ పవన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మున్సిపల్ టౌన్ ప్లానింగ్, హౌజింగ్ సొసైటి అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి చేరుకొని ప్రభుత్వ భూమియేనని నిర్ధారించి లేఅవుట్ చూపించారు. ఈ సందర్భంగా హౌజింగ్ సొసైటి అధికారి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ న్యూహౌజింగ్ బోర్డులోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు పాల్పడేందుకు వచ్చారన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి హౌసింగ్ సొసైటిదేనని గుర్తించామన్నారు. కౌన్సిలర్ పవన్ నాయక్ మాట్లాడుతూ 1988లో హౌసింగ్ సొసైటి ఆధ్వర్యంలో సంబంధిత భూమి వద్ద శిలాఫలకం కూడా వేశారన్నారు. 30 ఏండ్ల నుంచి ఆ స్థలం అలానే ఉందన్నారు. కానీ కొందరు ఆ విలువైన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని జోన్ 1 కాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌లో అనూహ్యంగా వర్షం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఫెంగిల్ తుఫాను ప్రభావం ఆదిలాబాద్ జిల్లాపై పడింది. తుఫాను ప్రభావం కారణంగా గత మూడు రోజులుగా చలి తీవ్రత తగ్గిపోగా.. వాతావరణం చల్లబడింది. తాజాగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ప్రభావం ఉండగా.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. 7గంటల సమయంలో చిన్నపాటి చినుకులు రాలగా.. 7.15గంటలకు ఒక్కసారిగా వర్షం జోరు పెరిగింది. సుమారు అరగంట పాటు జోరుగా కురిసిన వర్షానికి ఆదిలాబాద్ పట్టణం తడిసిముద్దయింది. అప్పటి వరకు రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించిన వారి సామగ్రి తడిసిపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. చిరుద్యోగులు, వివిధ పనుల నిమిత్తం మార్కెట్‌కు వెళ్లిన వారు వర్షానికి తడిసిపోయారు. జిల్లాకు వర్ష ప్రభావం లేకపోవడంతో వర్షం రాదని అందరూ భావించారు. కానీ హఠాత్తుగా వర్షం రావడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.

లంచావతారులు..!

- అక్రమార్జనకు అలవాటుపడుతున్న కొందరు అధికారులు
- ముడుపులకు ఆశపడి పక్కదారి పడుతున్న వైనం
- డబ్బులు ఇవ్వలేక ఏసీబీని ఆశ్రయిస్తున్న ప్రజలు
- ఏటా పట్టుబడుతున్నా మారని కొందరు ఉద్యోగుల తీరు
- తాజాగా ఏసీబీకి చిక్కిన నిర్మల్ మార్కెటింగ్ అధికారి

సర్కారు కొలువు.. రూ.లక్షల్లో జీతం.. ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు కారు.. ఏసీ, కూలర్ల సౌకర్యం..వంటి వసతులతో కూడిన ఉద్యోగాలు నిర్వర్తించడం అధికారుల విధి అయితే.. కింది స్థాయి ఉద్యోగులకు కూడా ప్రభుత్వం రూ.లక్షల్లో వేతనం అందజేస్తోంది. సర్కారు నుంచి వచ్చే వేతనంతో హాయిగా జీవించాల్సి ఉండగా.. కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్జనకు ఆశపడి కటకటాలపాలవుతున్నారు. సమాజంలో అవినీతిపరులుగా ముద్ర వేసుకుంటున్నారు. తోటి వారి ఎదుట తలెత్తుకోలేని పరిస్థితి తెచ్చుకుంటున్నారు. లంచం తీసుకోవడం నేరమైనప్పటికీ.. అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడి జైలుకు వెళ్లాల్సిన దుస్థితి తెచ్చుకుంటున్నారు. తాజాగా ఓ దద్వాయిల నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటూ నిర్మల్ జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)కి పట్టుబడగా.. ఇటీవల ఇదే జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. వారం వ్యవధిలోనే ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడటం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



ఆదిలాబాద్‌లోని మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అవినితి నిరోధకశాఖ దాడులు ముమ్మరం చేసింది. అక్రమార్జనకు అలవాటుపడుతున్న అధికారులు, సిబ్బంది భరతం పడుతోంది. డబ్బులకు ఆశపడి రైతులు, సామాన్య జనాలను ముప్పుతిప్పలకు గురి చేస్తున్న అధికారులు, సిబ్బందిని కటకటాలపాలు చేస్తోంది. బాధితుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్న ఏసీబీ అధికారులు లంచావతారుల ఆటకట్టించడం చర్చనీయాంశంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా ఎక్కడో ఓ చోట ఏసీబీకి పట్టుబడుతున్నా కొందరు అధికారులు, సిబ్బందిలో మార్పు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో 2023లో 9మంది ఏసీబీకి పట్టుబడగా.. 2024లో ఈ సంఖ్య 12 మందికి చేరింది. ఇందులో 11మందిని ఏసీబీ అధికారులు నేరుగా ట్రాప్ చేసి పట్టుకోగా.. ఓ అధికారిపై అవినీతి ఆరోపణలు రావడంతో తనిఖీలు చేపట్టి కేసు నమోదు చేసింది. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఏసీబీ వలలో పడుతున్నా మిగితా వారిలో ఆ తాలుకూ భయం లేకుండా పోతోంది. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు తమ దగ్గరకు వస్తున్న ప్రజలను ముడుపుల కోసం వేధించడం.. ఆయా పనులను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్‌లో పెడుతుండటంతో రైతులు, ఇతర వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అడిగినంత ఇచ్చుకోలేక.. సమస్య పరిష్కారం కాక తీవ్రంగా సతమతమవుతున్న జనం ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఏసీబీ అధికారులు చాకచక్యంగా అవినీతి అధికారులు, ఉద్యోగులను పట్టుకొని జైలుకు పంపిస్తూ అవినీతిని పెకిలించే ప్రయత్నం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

కొందరి తీరుతో అవినీతి మరకలు..!

కొందరు అధికారులు, సిబ్బంది తీరుతో అధికార వ్యవస్థ అబాసుపాలవుతోంది. అధికార వ్యవస్థకు అవినీతి మరకలు అంటుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అనేక మంది అధికారులు, ఉద్యోగులు ఉత్తమ పనితీరు కనబరుస్తూ ..జవాబుదారితనంతో వ్యవహరిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి కనబరుస్తున్న వారు ఉన్నారు. కానీ కొందరు అధికారులు, సిబ్బంది తీరు ఇందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే వేతనం కాకుండా.. అక్రమార్జన కోసం వెంపర్లాడే కొందరు అధికారులు, సిబ్బంది తీరు కారణంగా అధికార వ్యవస్థకు మచ్చ వస్తోందనే విమర్శలున్నాయి. చిన్నపాటి సమస్య పరిష్కారానికి సైతం ఎంతో కొంత.. ఏదో రూపంలో ఇచ్చుకోలేనిదే పని కావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా ఏసీబీ అధికారులు మంగళవారం రాత్రి బోరజ్ చెక్‌పోస్టులోనూ తనిఖీలు చేపట్టగా..లెక్కల్లో లేని రూ.62,500 సొమ్మును సీజ్ చేశారు. తాజాగా బుధవారం నిర్మల్ జిల్లా మార్కెటింగ్ అధికారి పట్టుబడటం.. ఇదే జిల్లాలో వారం రోజుల క్రితం సర్వేల్యాండ్ శాఖలో ఇద్దరు ఉద్యోగులు, ఇంతకు కొద్ది రోజుల ముందే మున్సిపల్‌లో ఓ ఉద్యోగి ఏసీబీ వలకు చిక్కడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో పలువురు రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల ఉద్యోగులు సైతం పట్టుబడిన ఉదంతాలు ఉన్నాయి. గత రెండేండ్లలో 21మంది మండల, జిల్లా స్థాయి అధికారులు ఏసీబీకి పట్టుబడటం చూస్తే జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థమవుతోంది.

యాపల్‌గూడలో ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

యాపల్‌గూడలో ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా అసెంబ్లీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్సీ అర్కాల నర్సారెడ్డి విజయోత్సవ సంబరాలలో పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు డప్పు చప్పుళ్లతో పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ముందుగా కొమురం భీం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఒరిగిందేమీ లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు వేయించుకొని పబ్బం గడుపుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇండ్లిచ్చిందని, ప్రస్తుతం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు ఇండ్లు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, రూరల్ మండల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, మామిల్ల భూమయ్య, అరిగెల కిష్టయ్య, సార్ల సత్యనారాయణ, పార్ల సురేష్, డేరా కృష్ణారెడ్డి, సట్ల నాగన్న, క్యాతం శివ ప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నిమ్మల గౌతమ్‌రెడ్డి, భావ్నే దత్తు, గుమ్మడి గణేష్, దాసరి ఆశన్న, వామన్, అశోక్, నరిగి ఆశన్న యాదవ్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ పాల్గొన్నారు.

తేనె టీగల పెంపకాన్ని ప్రోత్సాహిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

తేనెటీగల పెంపకం చేసే గిరిజన యువతీ యువకులకు ఐటీడీఏ సహకరిస్తుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ సంస్థ ఆధ్వర్యంలో తేనె టీగల పెంపకంపై కేబీ కాంప్లెక్స్‌లో సమావేశం మందిరంలో మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాణ్యమైన తేనెకు బహిరంగ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉందని, మంచి ఆదాయం పొందటంతో పాటు, పది మందికి ఉపాధి చూపించవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులకు ఐటీడీఏ సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి(పిహెచ్ఓ) గుడిమళ్ల సందీప్ కుమార్ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన రైతులకు ఉద్యాన శాఖ లేదా ఖాదీ విలేజ్ బోర్డు ద్వారా రాయితీలు సైతం అందుబాటులో ఉన్నాయని, పూర్తి స్థాయి లో అవగాహన వచ్చిన తర్వాత తేనె టీగల పెంపకం చేపట్టాలని సూచించారు. తేనె పుట్టల నుండి తేనెను ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సిడబ్ల్యుఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి లక్ష్మీనారాయణ, ట్రైనర్లు రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొమురం సత్యవతీకొటేష్

నవతెలంగాణ-ఇచ్చోడ



ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మేడిగూడ గ్రామానికి చెందిన కొమురం సత్యవతీ కోటేశ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 20 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కష్టకాలంలో పార్టీ వెంట ఉండి నడిపించిన సత్యవతీకోటేష్‌ను అధిష్ఠానం గుర్తించి పదవి కట్టబెట్టింది. ఆదివాసి తెగకు చెందిన వ్యక్తికి కాంగ్రెస్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు ఇవ్వడంతో ఆదివాసి సమాజం కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. సత్యవతీకోటేష్ ఎన్నో యేండ్ల నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ఆదివాసి కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. సేవలను గుర్తించిన పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించింది.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాయికిరణ్

నవతెలంగాణ-తలమడుగు



మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇద్దరు యువకులు పోటీ పడగా రుయ్యాడికి చెందిన చెన్నాల సాయికిరణ్ 1158 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. కొద్ది నెలల క్రితం ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా యువతకు ఓటు హక్కు కల్పించారు. చెన్నాల సాయికిరణ్ అత్యధిక ఓట్లు సంపాదించడంతో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు.

నేరడిగొండ : తేజాపూర్ గ్రామానికి చెందిన బద్దం పోతారెడ్డి యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా జరిగిన ఎన్నికలలో రెండవసారి విజయం సాధించాడు. తనను అన్ని విధాలుగా ప్రోత్సహించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గజేందర్ నాయకత్వంలో యువకులను కలుపుకొని నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆశాలు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్ ఓ హరీష్‌రాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సమ్మక్క, శోభ మాట్లాడుతూ తెలంగాణ ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2013 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశామన్నారు. సమ్మె సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారు. కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని, ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని హామీ నిచ్చారన్నారు. డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారని, వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ నిచ్చిందన్నారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ రూ.50లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి నేటి వరకు సంవత్సర కాలంలో మంత్రులకు, ఎంఎల్ఎలకు, ఉన్నతాధికారులకు ఆశాలు అనేక విజ్ఞప్తులు చేశారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆశాలు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్, నాయకులు మహేందర్, ఆశా జిల్లా కమిటీ సభ్యులు పద్మ, అరుంధతి, పద్మ లావణ్య, కవిత ,రాణి, సుజాత, రాజ్యలక్ష్మి, సుశీల, సునీత, లీలా, శారద పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మార్కెటింగ్ అధికారి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్, ఆదిలాబాద్‌టౌన్

నిర్మల్ జిల్లా మార్కెటింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న టి.శ్రీనివాస్ దడువాయి నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దడువాయి కుమ్మరి వెంకటేష్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగా శ్రీనివాస్ లైసెన్స్ జారీ చేయాల్సి ఉంది. దీనికోసం శ్రీనివాస్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. వెంకటేష్ అభ్యర్థన మేరకు లంచం మొత్తాన్ని రూ.7వేలకు తగ్గించాడు. రూ.7 వేలు ఇస్తే లైసెన్స్ ఇస్తానని చెప్పడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం మధ్యాహ్నం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో ఉంటున్న ఆయన నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులను విచారించి పలు పత్రాలు, బ్యాంక్ స్టేట్మెంట్లు, ఆస్తుల వివరాల గురించి తెలుసుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-సారంగాపూర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. బుధవారం ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని స్వర్ణ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీతోపాటు రైతు భరోసా, రైతు బీమా, రైతు పండించిన సన్న వడ్లకు రూ.500 బోనస్, ఇస్తోందన్నారు. రూ.500కు వంట గ్యాస్, ప్రతి ఇంటికి ఉచిత కరెంటు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది, వైస్ ఛైర్మెన్ శంకర్‌రెడ్డి, మాజీ అడెల్లి పోచమ్మ ఛైర్మెన్, కాంగ్రెస్ నాయకులు విలాస్‌రావ్, మారుతి, ముత్యంరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, సత్యాపాల్‌రెడ్డి, మధుకర్, మయారాం, ధన్‌సింగ్, తేజు, రాజు, మార్కెట్ డైరెక్టర్లు, పోతారెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, భోజన్న, నాగోరావ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌లో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టర్ రాజర్షి షా గుడిహత్నూర్ మండల కేంద్రంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉమ్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనంలో వండిన వంటలను పరిశీలించి విద్యార్థులకు క్వాంటిటి ప్రకారం భోజనం ఇస్తున్నారా, సరిపడా భోజనం వండుతున్నారా అంటూ తదితర వివరాలు ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. విజయ డెయిరీ పాలు సరఫరా అవడం లేదని తెలుపగా, వెంటనే అధికారికి ఫోన్ చేసి పాలు సరఫరాపై ఆరా తీశారు. పాలు సరఫరా చేస్తామని విజయ డెయిరీ అధికారి మధుసూదన్ తెలిపారు. భోజనం వండడానికి ముందే ప్రతి రోజు సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, ఉదయం, సాయంత్రం సమయాలలో అల్పాహారం, స్నాక్స్ అందించాలని సూచించారు. నీటి సంపు, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, మరమ్మత్తులు చేయించాలని తెలుపగా సంబంధిత అధికారిని ఆర్‌ఓ ప్లాంట్‌కు సంబంధించి వివరాలు సేకరించి మరమ్మత్తులు చేయించాలని పేర్కొన్నారు. అనంతరం రిజిష్టర్‌లను పరిశీలించి, వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.

జిన్నింగ్ మిల్లు సందర్శన

అనంతరం మండలంలోని జిన్నింగ్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి కోనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పత్తి తేమ శాతం, ఆన్‌లైన్‌లో డేటా నమోదు, మాయిశ్చర్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. 8 శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ చేస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజన్న, ఉపాధ్యాయులు, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపిడిఓ, ఏంఈఓ పాల్గొన్నారు.

కేసుల్లో ఫొరెన్సిక్ సైన్స్‌పై పెరుగుతున్న ప్రాధాన్యత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం వస్తున్న రకరకాల కేసుల్లో ఫొరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యత పెరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ అన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రొబ్ ల్యాబ్ ఫొరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. దీనికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కేసుల్లో ఫొరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో నేరాల నిర్ధారణలో ఫొరెన్సిక్ సైన్స్ ప్రధానమైందన్నారు. కేసులను డిఫెన్స్ చేసే న్యాయవాదులు దేన్ని కూడా గుడ్డిగా నమ్మొద్దన్నారు. ఫొరెన్సిక్‌పై అవగాహన కల్పించేలా సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అధునాతన టెక్నాలజీపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రహీం, రమస్ దేశ్‌ముఖ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



పద్మశాలి మహిళా సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తన్నీరు నవత, గౌరవ అధ్యక్షురాలుగా శంకరమ్మ, ప్రధానకార్యదర్శిగా ఆసం రమాదేవి, కోశాధికారిగా రాజమణితో పాటు 25 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొలిసారి మహిళా కమిటీ ఎన్నుకోవడంతో మహిళలు వివిధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను సమిష్టిగా చర్చించుకోవడానికి ఆస్కారం ఏర్పడిందని, సంఘం ఐక్యతకు హక్కుల సాధన కోసం ముందుకు వెళ్తామని అధ్యక్షురాలు నవత తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మోర ఆశన్న, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, నాయకులు బేత రమేష్, విలాస్, సత్యనారాయణ, విఠల్ పాల్గొన్నారు.

2

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

గురువారం | డిసెంబర్ 05, 2024 | www.navatelangana.com

మానసిక ఒత్తిళ్లను దూరం చేస్తాయి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



కార్తీక మాసంలో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమంలో మానసిక ఒత్తిళ్లను దూరం చేస్తాయని డిప్యూటి ఆర్‌ఎం(ఎం) ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనం 2వ రోజు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ రోజంత కష్టపడి ఎన్నో ఒత్తిళ్లకు గురై ప్రయాణికుల మనసులు గెలుచుకొని నిర్వీరామంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సిబ్బందికి అందరితో కలిసి ఆనందంగా వనభోజనాలు చేయడం ఎంతో ఆనందంగా ఆహ్లాధకరంగా ఉంటుంటుందన్నారు. ఈసందర్భంగా క్రీడాల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ ప్రతిమా రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికునికి సాయం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఖానాపూర్ మున్సిపాలిటీలో తాత్కాలిక పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న దర్శనాల లక్ష్మీ రాజేశ్వర్ కూతురు పెండ్లికి అవసరమైన బంగారు పుస్తెలు, వెండి మట్టెలను పట్టణానికి చెందిన కృష్ణంరాజు (మాజీ మంత్రి పీఏ) తన వంతుగా సాయం చేశారు. రాజేశ్వర్ కూతురు వివాహం నిశ్చయమైన విషయాన్ని కృష్ణం రాజుకు తెలిపారు. స్పందించిన కృష్ణం రాజు తన మిత్రుల ద్వారా బుధవారం ఆభరణం అందజేశారు.

రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, ప్రజా పంథా నాయకులు కోరారు. బుధవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించి డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, జిల్లా కార్యదర్శి కె. రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఎక్కువ ప్రయాణాలు రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడం, బస్సులు కొరత ఏర్పడడంతో ఉన్న బస్సుల్లో కిక్కిరిసిపోయిన జనంతో తల్లడిల్లి, ఊపిరి ఆడక సొమ్మసిల్లి పోతున్నారన్నారు. కొన్ని సందర్భంలో సీట్ల కోసం కొట్టుకునే పరిస్థితి ఉందని, చివరికి ఆర్టీసీ ఉద్యోగులపై సైతం అసభ్యకరమైన మాటలు, దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.లక్ష్మి, జిల్లా నాయకులు ఎస్.లక్ష్మి, నాయకులు ఎం బక్కన్న, ఎస్ గంగన్న, కమల, విజయ, నర్సయ్య, కవిత, దుర్గ, గంగామణి, లక్ష్మి, కవిత, విజయ, వసంత పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేశాం



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం అన్నారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుర్మ శ్రీనివాస్, కమీషనర్ మనోహర్, నాయకులు జన్నారపు శంకర్, నాయిని సంతోష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ మేళా



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ మేళను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మైక్రోస్కోప్, నీటి పారిశుధ్యం, వ్యవసాయం చేపల పెంపకం రాకెట్ వివిధ రకాల పరికరాలు ప్రదర్శనలో ఉంచారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ శేఖర్ సైన్స్ మేళాను పరిశీలించి విద్యార్థులు తయారు చేసిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి భవిష్యత్తులో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సైన్స్ మేళ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రావు, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మురళీధర్, శ్రీనివాస్, నరసయ్య, చంద్రమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

విజేత పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో విజేత పాఠశాలలో బుధవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు 100కు పైగా ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు చేసిన ప్రాజెక్టుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు నిత్యం క్లాసులలో నేర్చుకున్న అంశాలను అద్భుతంగా వివరించి వారి అభ్యసనా సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. మూడు సంవత్సరాలుగా స్టూడెంట్ లెడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్‌తో ఆటు అన్ని సబ్జెక్టుల పట్ల ఆసక్తి కలిగే విధంగా చేయడం చాలా మంచి పరిణామమని పాఠశాల డైరెక్టర్ మదిరే శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు సుధాకర్, సుస్మిత, ప్రవళిక, గౌరీ, శైలజ, నవీన, రమ, రజిత, సౌజన్య, శ్వేత, స్రవంతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులపై దాడులు ఆపాలి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు వెంటనే ఆపాలని హిందు ఐక్యవేదిక సభ్యులు కోరారు. హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సంఘీభావ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను ఆపాలని ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్‌ను జైలు నుండి వెంటనే విముక్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ నూకల విజయ్ కుమార్, నగర సంఘ చాలక్ ప్రమోద్ చంద్ర రెడ్డి, విభాగ్ సామాజిక సమరసత ప్రముఖ్ అల్లాడి సూర్యనారాయణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు జాదవ్ విఠల్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మెడిసెమ్మె రాజు, రావుల రాంనాథ్, వియెచ్పీ విభాగ్ నాయకులు పతికే రాజేందర్, హిందూవాహిని జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల హరీష్ పాల్గొన్నారు.

కంపించిన భూమి.. భయాందోళనలో జనం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని వేణు నగర్‌తో పాటు పలు చోట్ల బుధవారం భూ ప్రకంపణలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం 7:05 గంటల సమయంలో రెండు సెకండ్ల పాటు భూమి కదిలి పించిందని స్థానికులు తెలిపారు. భూ ప్రకంపణలు రావడంతో ఉలిక్కిపడ్డారు. ఇల్లు గొడకి బీటలు పడ్డాయి. వంటింటిలోని వంటపాత్రలు కింద పడడంతో స్థానికులు గమనించారు. ఈ ఘటనలో ఎక్కడ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.

ఖానాపూర్ టౌన్ : ఖానాపూర్ పట్టణంలో బుధవారం భూమి స్వల్పంగా కదిలినట్టు ప్రచారం జరిగింది. ఉదయం 7-30, 8సమయంలో ఈ సంఘటన జరిగినట్లు పలువురు తెలిపారు. ఆసమయంలో తను కూర్చున్న కుర్చీ కదిలినట్లు శాంతినగర్‌కి చెందిన ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ పాదం రాజన్న తెలిపారు. గతంలో ఎప్పుడూ ఖానాపూర్ ప్రాంతంలో భూమి కంపించిన సంఘటన చోటు చేసుకోలేదు. భూమి కంపించిందనే వార్త పట్టణ ప్రజల్లో విస్తృతంగా చర్చజరిగింది. దీంతో స్థానికులు కొంత ఆందోళన చెందారు.

పదేండ్ల బీఆర్‌ఎస్‌లో గడీల పాలన నడిచింది

- మాజీ ఎమ్మెల్సీ అర్కాల నర్సారెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నాటి పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో గడీల పాలన దొరల పాలన నడిచిందని కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసలైన ప్రజా పాలన కొనసాగుతుందని ప్రజాపాలన విజయోత్సవ సంబరాల ఆదిలాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అర్కాల నర్సారెడ్డి అన్నారు. ఏడాది ప్రజా పాలన విజయోత్సవాల సంబరాల సందర్భంగా ఆదిలాబాద్‌లో పర్యటించిన ఆయన పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ప్రజలు కోరుకున్న విధంగా వారికి నచ్చే రీతిలో రీతిలో పాలన కొనగిస్తుందని, ఈ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదని కేవలం ఏడాదిలోనే ఇచ్చిన గ్యారెంటీలలో కొన్నింటిని అమలు చేసి ఎన్నికల ముందు చెప్పని ఇంకా ఎన్నో అనేక మంచి పనులు చేసి చూపిందన్నారు. ఈ సంవత్సర కాలంలో గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో యువతకు 55,143 ఉద్యోగ నియామకాలిచ్చి యువ వికాసం జరుపుకుంటుందన్నారు. సన్నవడ్ల సాగును పెంచాలన్న ఉద్దేశంతో వరికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తుందన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లేయించుకొని పబ్బం గడుపుకోవడం తప్ప మరొకటి కాదన్నారు. బీఆర్ఎస్ దొరల పార్టీ బీజేపీ మతతత్వ పార్టీ అని ఈ రెండు పార్టీల వల్ల ప్రజలకు గతంలో ఒరిగిందేమీలేదని భవిష్యత్తులో కూడా ఒరిగేదేమీ ఉండదని అన్నారు. రైతులకు సంక్రాంతికి ఎకరానికి రూ.15వేల రైతు భరోసా వడ్లకు రూ.500 బోనస్‌తో ప్రభుత్వం డబుల్ ధమాకా అందిస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ప్రజాపాలన సంబరాలు

జిల్లాకు విచ్చేసిన విజయోత్సవ సంబరాల అసెంబ్లీ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అర్కాల నర్సారెడ్డి బుధవారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సంబరాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఏడాది పాలన సంబరాలు జరుపుకున్నారు. తర్వాత క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి జైకొడుతూ ర్యాలీ చేపట్టారు. ఈ సంబరాలలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజా రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్ రావు, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ముధోల్

మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని తరోడ గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్రం పథకంలో భాగంగా ఫిష్ పాండ్‌లో చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఫిష్ పాండ్ ఏర్పాటు చేసి వాటికి నిధులు కేటాయించి రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులు కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు మహిళా సంఘాల్లో రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కింద కోట్లాది రూపాయలను ప్రతి సంవత్సరం మంజూరు చేస్తుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఫిష్ పాండ్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తరోడ గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. అలాగే మహిళా సంఘాలకు మంజూరైన రుణం రూ.కోటి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయ లక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ శివకుమార్, ఎంపీఓ శిరిష, ఏపీఎం గురు చరణ్, వీఓ ఓమేష్, నాయకులు నర్సాగౌడ్, రవికిరణ్, సాయిరాం, నిమ్మ పోతన్న, దత్తాద్రి పాల్గొన్నారు.

అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిది

నవతెలంగాణ-సిరికొండ



అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని తహసీల్దార్ తుకారాం, సిరిచెల్మ టైగర్ జోన్ అధికారి నాగస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, ప్రపంచ వన్య ప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అడవులను అగ్ని బారి నుండి కాపాడాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. చెట్లు లేకపోతే జీవకోటి మనుగడ అంతరించి పోతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి అడవిని కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఏఎస్ఐ అశోకొరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సునీల్, నాయకులు పెంటన్న, అనిల్, అమూల్, చందు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణలో రాష్ట్రంలో ఉన్న అణగారిన వెనకబడిన పీడిత బాధ్యత వర్గాల సమస్యల పరిష్కారం కోసం ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధినేత డా.విశారదన్ మహారాజ్ చేస్తున్న 15 వేల కిలోమీటర్ల మా భూమి పాదయాత్ర ప్రారంభ సభ కరపత్రాన్ని జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు మైనారిటీలు పేదల ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి ఇల్లు, భూమిని సాధించే దిశగా ఈ మాభూమి పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. జనవరి 5న జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజీ మైదానంలో నిర్వహించే పాదయాత్ర ప్రారంభ సభకు జిల్లాలోని బీసీ ఎస్సీ ఎస్టీలు మైనారిటీలు అగ్రకుల ప్రజాస్వామ్యవాదులందరు హాజరై ప్రారంభసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అన్నెల లక్ష్మణ్, జిల్లా నాయకులు వెంకటేష్, నరేష్, రాజేశ్వర్, రామచందర్, తిరుపతి, ఓమన్న గంగన్ననవీన్, వినుు, కుమార్, సాయి, మధులు పాల్గొన్నారు.

అవినీతి రాజ్యమేలుతోంది..

నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజమేలుతుందని బీజేపీ ఆదిలాబాద్, పెద్దపెల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి భూమయ్య, రావుల రామ్‌నాథ్, రాష్ట్ర నాయకులు రితీష్ రాథోడ్ అన్నారు. బుధవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఆర్ గ్యారంటీలు 66 హామీలు అమలు చేస్తామని ఆరు అబద్ధాలు 66 మోసాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, మండలాధ్యక్షులు టేకు ప్రకాష్, పట్టణాధ్యక్షులు నాయిని సంతోష్, ఆయా మండలాల అధ్యక్షులు లక్ష్మణ్, లింగాగౌడ్, శ్రీనివాస్, ఐద వెంకటేష్, రాజశేఖర్, అనిల్ రావు, గోపాల్ రెడ్డి, గడ్డం రవీందర్, కిష్టయ్య ఉపేందర్, ఎడ్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.



నాస్ పరీక్షలో విద్యార్థులు రాణించాలి

- డీఈఓ రామారావు



నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థుల్లోని సామర్థ్యాల ప్రగతిని అంచనా వేయడానికి నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షలో విద్యార్థులు రాణించాలని డీఈఓ రామారావ్ అన్నారు. బుధవారం పరీక్ష పరిశీలకులు, రాష్ట్ర నోడల్ అధికారి హరికృష్ణతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జుమ్మేరాత్ పేట్, శాంతినికేతన్ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 91 పాఠశాలలో 3,6,9వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ పరీక్షకు 91 మంది అబ్జర్వర్లు 136 మంది పరీక్ష నిర్వాహకులు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అబ్జర్వర్లు, పరీక్ష నిర్వాహకులు పొరపాట్లు లేకుండా నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్ రావు, నాస్ రిసోర్స్ పర్సన్ నారాయణ వర్మ, అబ్జర్వర్లు, పరీక్ష నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. బజార్‌హత్నూర్ మండలంలోని మోర్కండి గ్రామానికి చెందిన ఎల్.మమతకి రూ. 12,500, గుడిహత్నూర్ మండల కేంద్రంలోని డి.మమతకి రూ. 33,000, బోథ్ మండలంలోని కుచులపూర్ గ్రామానికి చెందిన ఎస్.ఉమకి రూ. 22,300 మంజూరు కాగా వాటిని అందజేశారు.

ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత అధికం

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగోన్నతి పొందిన ప్రతి ఒక్కరికి బాధ్యతలు అధికమవుతాయని మరింత ఉత్సాహంగా విధులను నిర్వర్తించాలని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. నేరస్తుల వేలి ముద్రలను కనుగొనడంలో దిట్టగా పేరుందిన ఫింగర్ ప్రింట్ ఏఎస్సై పి.శ్రీనివాస్ 20 సంవత్సరాలుగా ఆర్మీలో విజయవంతంగా ఉద్యోగం నిర్వర్తించి తెలంగాణ రాష్ట్ర పోలీసు వ్యవస్థలోకి 2020 సంవత్సరంలో ఫింగర్ ప్రింట్ ఏఎస్ఐగా అడుగుపెట్టి నేడు ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ ఉద్యోగోన్నతి స్టార్ చిహ్నాన్ని భుజాలపై అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, మరింత పనితనాన్ని ప్రదర్శిస్తూ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

విద్యా భారతి పాఠశాలలో పోలింగ్

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి విద్యా భారతి పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల పోలింగ్ పటిష్ట భద్రతల మధ్య రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా నిర్వహించారు. విద్యార్థుల నాయకత్వం లక్షణాలు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం కోసం ఈ పోలింగ్ నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగా సింగ్ తెలిపారు. ఎన్నికల నియమనిబంధనలకు అనుగుణంగా రెండు రోజుల ముందు నామినేషన్ల స్వీకరణలో 11మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేవారు. ఇద్దరు అభ్యర్థులు ఉపసంవరించుకున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు గ్రామంలో ప్రచారం నిర్వహించి పాఠశాలలో నిజంగా ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా ఎన్నికలు సజావుగా జరిపినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మధుసూదన్ తెలిపారు. ఎన్నికల ఫలితాలలో ఏ. మధుశ్రీ, పుస్తకం గుర్తుతో 80 ఓట్లతో విజయం సాధించగా రెండవ స్థానంలో విజిల్ గుర్తు అభ్యర్థి ఎన్. రామ్ తేజ్ నిలిచారు. గెలిచిన అభ్యర్థి ప్రమాణ స్వీకారం చేసి విద్యార్థుల అభ్యున్నతికి తనవంతుగా పాఠశాలలో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి. పోతన్న, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు భోజన్న, ప్రవీణ్, రాజు, సాయినాథ్, రాజు, దేవకి, అస్మిత, గంగామణి, నేహా, శృతిక, వైష్ణవి, గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమల పాదయాత్ర చేసి వచ్చిన స్వాములకు సన్మానం

నావతెలంగాణ-కుభీర్

మండలంలోని బెల్గం గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప స్వాములు బాసర పుణ్య క్షేత్రం నుంచి శబరిమలకు కాలినడకన వెళ్లి అయ్యప్ప మాలతో అయ్యప్పను దర్శించుకొని తిరిగి బుధువారం గ్రామ సన్నిదనానికి చేరుకున్నారు. దీంతో మహిళలు యువకులు గ్రామ ప్రజలు అయ్యప్ప మాల స్వాములకు స్వాగతం పలికి వారికి సన్మాంచారు. కాలినడకా నడిచి పూర్తి చేసి వచ్చినదుకు ఆనందంగా ఉందన్నారు.

కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన గుర్లే ప్రభాకర్ పత్తి వారం రోజుల క్రితం కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు వారి నివాసానికి వెళ్లి కాలి బూడిదైన ఇంటిని, పత్తిని పరిశీలించి పరామర్శించి ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదే గ్రామానికి చెందిన బోయిరే భీమయ్య కుమారుడు నరేష్ మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, తుకారాం, పవన్, నవీన్, రాజన్న, భీమయ్య, జనర్ధాన్, సందీప్ ఉన్నారు.

అటవీ శాఖ క్వార్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలో కంపా నిధులు రూ.29 లక్షలతో నూతనంగా నిర్మించిన అటవీ శాఖ బీట్ అధికారి క్వార్టర్‌ను ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్, టీపీసీసీ మెంబెర్ అర్షద్ హుస్సేన్, మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ తెలుగే రమేష్, నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ రాజు, సుధాకర్, శంకర్ గౌడ్, అత్త బేగ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా నాస్ పరీక్ష

- పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల విద్యలో నాణ్యత ప్రమాణాలు తెలుసుకునే ఉద్దేశంతో 3, 6, 9 తరగతులకు నిర్వహించే నేషనల్ అచీవ్మెంట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడవ తరగతికి సంబంధించిన పరీక్ష 662 పాఠశాలల్లో, 6, 9 తరగతులకు సంబంధించిన పరీక్ష 72 పాఠశాలల్లో నిర్వహించినట్లు, దీనికి గాను మొత్తం 4492 మంది విద్యార్థులు హాజరయ్యారని, వీరి కోసం 81 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఇది తోడ్పడుతుందని, ఆధారంగా చేసుకుని జిల్లా విద్యాభివృద్ధిని అంచనా వేస్తారని తెలిపారు. ముందు నుండే విద్యార్థులను పరీక్షల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిద్ధం చేసినట్లు వివరించారు.

సన్నరకం ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-రెబ్బెన

రైతులు సన్నరకం ధాన్యాన్ని జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లను కొరత లేకుండా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్‌మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్య కేంద్రాన్ని జిల్లా పశు వైద్య అధికారి ఎం.సురేష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల మండల పశు వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా అఖిల భారతీయ పశు గణన ఫిబ్రవరి 28లోపు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో పశు వైద్య అధికారి శ్రీకాంత్ ఉన్నారు.

రోడ్డు మరమ్మత్తు పనుల్లో నాణ్యత లోపం

నవతెలంగాణ-కెరమెరి

కెరమెరి నుండి ఆసిఫాబాద్ వెళ్లే ప్రధాన రహదారి మరమత్తు పనుల్లో నాణ్యత పాటించడం లేదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాత్ ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని ఝరి గ్రామ సమీపంలో చేపడుతున్న ప్రధాన రహదారి మరమత్తు పనులను పరిశీలించారు. ప్రభుత్వం మరమ్మత్తు పనుల కోసం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు అధ్వాన్నంగా మారిందన్నారు. మరమ్మత్తు పనులను సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షించి మరమ్మత్తు పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ఆ స్థలం మున్సిపాలిటీదే..

- స్పష్టం చేసిన సిర్పూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
- ఆక్రమణకు యత్నించిన వారికి చెంపపెట్టు
- 'నవతెలంగాణ' చెప్పిందే నిజమైంది

మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోనే కోట్ల విలువైన స్థలం. ఈ స్థలంపై గత కొన్నేళ్ల నుండి మున్సిపాలిటీకి, ఇతరులకు మధ్య కోర్టులో వివాదం. అయినా ఈ స్థలాన్ని అక్రమించుకొని విక్రయించి కోట్లు చేజిక్కించుకోవాలని మున్సిపల్ పాలకవర్గంలో కొంతమంది ప్రయత్నాలు. లోలోపల దీని విక్రయానికి అన్నీ పనులు చక్కబెట్టుకుంటున్న సమయంలోనే ఆగష్టు 18న 'రూ. కోట్ల స్థలం.. ఆక్రమణల పర్వం' అనే శీర్షికతో నవతెలంగాణ దినపత్రికలో వార్తా కథనం ప్రచురణ. ఇంకేముంది అందరి దృష్టి దానిపై పడింది. ఇపుడు సిర్పూరు (టి) కోర్టు కూడా ఈ స్థలం మున్సిపాలిటీదే అని స్పష్టం చేసింది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి అతి సమీపంలోనే ఎన్టీఆర్ చౌరస్తాలోని వివాదాస్పద స్థలం మున్సిపాలిటీదేనని సిర్పూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా మున్సిపాలిటీకి, ప్రైవేట్ వ్యక్తికి మధ్య కోర్టులో కొనసాగుతున్న వివాదానికి కోర్టు తెర దించుతూ ఈ స్థలం మున్సిపల్ స్థలమేనని తీర్పు వెలువరించింది. పట్టణ నడిబొడ్డున ప్రధాన రహదారిని ఆనుకొని ఈ కోట్లాది రూపాలయ విలువైన స్థలాన్ని చేజిక్కించుకునేందుకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులలో కొంతమంది తీవ్ర ప్రయత్నాలు సాగించడమే కాదు అధికారులను



ఇప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో ఈ స్థలం వేరే వ్యక్తి పేరుతో ఉన్న దృశ్యం

మచ్చిక చేసుకొని ఈ స్థలాన్ని ఒక వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇంటి నెంబర్ కూడా కేటాయించారు. ఈ విషయాన్ని 'నవతెలంగాణ' అప్పట్లో బహిర్గతం చేయగా రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. తాము కేటాయించిన ఇంటి నెంబర్‌ను రద్దు చేశారు. అయినా ఈ స్థలం తమ చేతుల్లో నుండి ఎక్కడికీ పోదని, దీనిని తాము ఆక్రమించుకొని విక్రయించుకుంటామని ఆక్రమణదారులు బహిరంగ వ్యాఖ్యలు కూడా చేశారు. చివరికి ఈ స్థలం మున్సిపల్ స్థలమేనని కోర్టు తేల్చడం వారికి చెంపపెట్టుగా మారింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అంజయ్యను వివరణ కోరగా ఈ స్థలం మున్సిపాలిటిదేనని కోర్టు తీర్పు ఇచ్చిన మాట వాస్తమేనని అనాన్నరు.

అసలీ స్థలం సంగతేంటంటే...

కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 2008లో జీఓ నెం. 1180, తేది 13-10-2008 ద్వారా అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మికశాఖకు సంబంధించిన 147/2 సర్వే నెంబర్‌లో 4.50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో కొద్ది భాగంలో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించగా, మరికొద్ది స్థలం ప్రధాన రహదారిని ఆనుకొని మిగిలి ఉంది. 2016లో ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మున్సిపాలిటీకి నిధులు రాగా నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పట్లో సర్వే నెం. 146 పట్టాదారు అయిన రాపెల్లి శ్రీనివాస్ 147/2లోని ఈ స్థలం తనదేనంటూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు



మున్సిపల్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిన స్థలమిదే

ఆదేశాల మేరకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పటి నుండి ఇది కోర్టు పరిధిలోనే ఉంది.

కోట్ల విలువైన ఈ స్థలంపై కన్ను పడిందిలా...

కోర్టు పరిధిలో ఉన్న ఈ స్థలంపై ఎవరి దృష్టి పెద్దగా లేదని భావించిన కొంతమంది బడాబాబులు దీని ఆక్రమణకు యత్నాలు ప్రారంభించారు. ఈ స్థలం తనదేనంటూ కోర్టును ఆశ్రయించిన సర్వే నెంబర్ 146 పట్టాదారు మృతి చెందడంతో అతని కుటుంబసభ్యులు కోర్టు వ్యవహారాలను పర్యవేక్షించారు. ఈ స్థలంపై కన్నువేసిన మున్సిపల్ పాలకవర్గసభ్యులు కొందరు ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమై 146పట్టాదారు కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరిపి ఈ స్థలంలో ఇల్లు ఉన్నట్లుగా మున్సిపాలిటీకి ఇంటి నెంబర్ కోసం ఈ ఏడాది జులై 13న దరఖాస్తు చేసుకున్నారు. అదే నెల 18న మున్సిపల్ కమిషనర్ ఇంటి నెం. 1-16-552/4/3/ఎ/1 కేటాయించారు. ఈ ఇంటి నెంబర్ సహాయంతో మరుసటి రోజే అంటే జులై 19న రాపెల్లి వెంకటసాయిబాబుకు అతని తల్లి నుండి (రిజిస్ట్రేషన్ నెం.1103/2024) గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ స్థలానికి అధికారులు ఏ విధంగా ఇంటి నెంబర్ కేటాయించారనే విషయంలో పలు అనుమానాలు రేకెత్తాయి. ఇది పత్రికలలో రావడంతో ఇంటి నెంబర్ రద్దు చేసిన అధికారులు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ టాక్స్) వెంకటసాయిబాబు పేరుతోనే ఉంచడం గమనార్హం.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించగా జిల్లా వైద్యాధికారి సీతారాం నాయక్ ధర్నా దగ్గరికి రాగా ఆశ వర్కర్లకు స్థిర వేతనం రూ.18000 చెల్లించాలన్నారు. లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ బకాయి పారితోషికాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆశ వర్కర్లను కార్మికులకు గుర్తించి కార్మిక చట్టం పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న గుర్తింపు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబరు 2 నుండి లెప్రసీ సర్వే చేయడానికి ఆశాలకు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని, పాత పెండింగ్ డబ్బులు ఇవ్వకుండా కొత్త సర్వే ఏంటని ప్రశ్నించారు. సర్వే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి సీతారాం నాయక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లేప్రెసి బిల్లుల మొత్తంలో 50 శాతం చెల్లిస్తామని తెలిపారు. మిగతా విషయాలను ఉన్నతాధికారులతో మాట్లాడతానని



హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, పద్మ జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు భాగ్య, కేసర, పంచశీల, బద్రుబాయి, మొగ్ర, అనితా, అనురాధ, సాక్రుబాయి, ఓమల, శోభ, లక్ష్మీ అరుణ, సరోజ, సురేఖ పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రారంభమయ్యేలా కృషి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రభుత్వం నుండి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర ప్రభుత్వం నుండి 60 శాతం నిధులు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి పార్టీలు వేరైనప్పటికీ ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులుగా కలిసి పనిచేసి సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడుదామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండేవిఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొని లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడ్డ సిర్పూర్ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, రోడ్లను మంజూరు చేసేల చూడాలని, అటవీ అనుమతులు లేని చోట అటవీ శాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, ఆ డబ్బులు చెల్లిస్తే అనుమతులు వస్తాయని, దానిద్వారా రోడ్లు బాగుపడి అభివృద్ధికి దోహదపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా నేరుగా నిధులు రావని వాటిని రాష్ట్రానికి పంపిస్తారని కావున రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసి నిధులు విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం అవుతున్న ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతోనే అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ రూ.650 కోట్ల నిధులతో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకొని ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఇటీవల కాలంలోనే రెండు లక్షల లోపు రుణాలు కూడా మాఫీ చేసిందని వారు తెలిపారు. జీఎస్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి కట్టింది ఎక్కువ అని కానీ రాష్ట్రానికి ఇచ్చేది మాత్రం తక్కువ అని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపుతోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ గౌరీ శంకర్, టీపీసీసీ మెంబర్ హర్షద్ హుస్సేన్ కాంగ్రెస్ నాయకులు సిద్దం గణపతి, ఓం ప్రకాష్, రేణిగుంట్ల పెంటయ్య, బీజేపీ నాయకులు తిరుపతి, వసి ఉల్లా ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ రెబ్బెన

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి గదులు, వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న విద్య బోధన, ఆహార నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. పాఠశాల పరిధిలోని బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, హాజరు శాతం పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వినియోగించాలని ఆదేశించారు. బాలికల సౌకర్యం కోసం మూత్రశాలలు త్వరగా నిర్మించాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్‌మోహన్, ఎంపీడీఓ, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని జైనూరు మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులతో పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. వాటి సంరక్షణ కోసం అటవీ అధికారులతో ప్రజలు కలిసి రావాలని కోరారు. ప్రస్తుతం పులుల సంచారం పెరిగిన నేపథ్యంలో అడవి పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అడవుల వన్యప్రాణుల రక్షణ లక్ష్యంగా ముందుకు సాగుతున్న తమకు ప్రజలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాజేశ్వర్, సెక్షన్ అధికారులు రాందాస్, సక్కారాం, భగవంతరావు, అనూష, బీట్ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రపంచ పర్యావరణ సంరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన



ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అటవి జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్తులకు అటవీ జంతువుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదని పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్, టీపీసీసీ నెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, నాయకులు జగ్గాగౌడ్, నాహిర్ అలీ, పెంటయ్య, అశోక్, లింగయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

నవతెలంగాణ-బెజ్జూర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల గిరిజన పాఠశాల, కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలన్నారు. కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో నాణ్యమైన కూరగాయలు లేకపోవడంతో సప్లై చేసే వాళ్లకు షోకజ్ నోటీస్ జారీ చేయాలని తహసీల్దార్ భూమేశ్వర్‌ను ఆదేశించారు. మెనూ పాటించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలని సూచించారు. కూరగాయలు, స్టాక్ గదులను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాల లోమధ్యాహ్న భోజనం పరిశీలించి, పప్పులో నీళ్ల చారు ఉండకుండా పప్పు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర సర్వే డేటా ఎంట్రీ కేంద్రాన్ని పరిశీలించారు. డాటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎంపీడీఓ గౌరీ శంకర్, ఆర్ఐ సంతోష్, కేజీబీవీ ఎస్ఓ అరుణ, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్ రావు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

గురువారం | డిసెంబర్ 05, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్



బెజ్జాల గ్రామ పంచాయతీ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవతో డీఎంఎఫ్‌టీ రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించినట్లు స్థానిక మాజీ సర్పంచ్ జైపాల్ గౌడ్ తెలిపారు. గ్రామ పంచాయతీ నాయకులతో కలిసి బుధవారం సీసీ రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించిన ఆయన రోడ్డు నిర్మాణం కోసం నిధుల విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ అభివృద్ధికి సహకరించండి

నవతెలంగాణ-జైపూర్



అటవీ అభివృద్ధికి గ్రామీణులు సహకరించాలని కోరుతూ గ్రామాల వారిగా గత మూడు రోజుల నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల అటవీ క్షేత్రాధికారి రత్నాకర్ తెలిపారు. ప్రధానంగా అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడుకోవడంతో పాటు వన్య ప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ పరంగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఈ సంధర్భంగా బుధవారం కుందారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వార అటవీ సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుందారం సెక్షన్ ఆఫీసర్ భగవత్ రావు, బీట్ ఆఫీసర్ సౌజన్య, శేఖర్, లవన్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, సీపీఐ(ఎం) నాయకుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-తాండూర్

పెద్దపల్లి యువ వికాస బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా తాండూర్ మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఆర్ఎస్, సీపీఐ(ఎం) నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎలుక రామచందర్, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, రాజన్న చింటూ యువ నాయకులు ఉన్నారు. సీపీఐ(ఎం) నుంచి మండల కార్యదర్శి దాగం రాజారాంను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎలుక రామచందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులను భయంతో చేపించిన అరెస్టులు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఐక్యతను పెంచుతాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పట్ల పోరాడుతామని తెలియజేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామనన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్

నవతెలంగాణ-జన్నారం

క్రీడలతో శారీరక దారుఢ్యం పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఇంధన్‌పెల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంధన్‌పెల్లి జడ్పీ ఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షటిల్ కిట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు లాంగ్ జంప్ పీట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌కు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి రాజేందర్, ఎఫ్ఎస్ఓ రవి , పీడీ శివనూరి తిరుపతి, ఉపాధ్యాయులు జడి రాజన్న, శ్రీకాంత్ శర్మ లక్మాన్, అంజన్న, లక్మి నారాయణ, పార్వతి, మాడావి కొండు, పృధ్విని , వెంకటేష్ పాల్గొన్నారు.

ద్వారకపూర్ పంచాయతీని పరిశీలించిన ఎంపీఓ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయితిని ఎంపీఓ అనిల్ బుధవారం పర్యవేక్షించారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌లను సందర్శించి కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువును తయారి విదానాన్ని పరిశీలించారు, ఎరువు తయారి ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. తయారు చేసిన కంపోస్ట్ ఎరువును నర్సరీ పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలని తెలిపారు. గ్రామంలోని రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేయించాలని, గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ చెత్త కనబడకుండా చూసుకోవాలనన్నారు. నర్సరిలో మొలక శాతం రాకుండా ఉన్న ఖాళీ బ్యాగుల్లో , విత్తనాలు నాటుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ అన్ని రికార్డ్స్‌ని పరిశీలించి అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఆయనతో పంచాయతీ సెక్రెటరీ కార్తీక్ ఉన్నారు

ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు

నవతెలంగాణ-తాండూర్

ప్రజా పాలనా ప్రజావిజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని మాదారం, కొత్తపల్లి, చౌటపల్లి గ్రామాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలపై అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో మరెన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాయాత్ర కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమాలలో సారధి కళాకారులు మామిళ్ల లచన్న, గొడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, రాంటెంకి రాజా తిరుపతి, వావిలాల నాగలక్ష్మి, కాసిపేట సంతోష్, పంచాయతీ కార్యదర్శులు వసంత్, సౌందర్య పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షను సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరిధిలో డిసెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షను సమర్ధవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రీజనల్ కో-ఆర్డినేటర్లు, ఎఆర్‌సీలు, సీఎస్‌లు, ఏసీఎస్, పరిశీలకులు, రూట్ అధికారులకు గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్య పర్యవేక్షకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సూపర్‌వైజర్లు, శాఖ అధికారులు, ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య, పోలీసు సిబ్బంది, తాగునీరు, మూత్రశాలలు, కనీస వసతులు కల్పించాలని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా సౌకర్యాలు కల్పించడంతో పాటు విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని అలన్నారు. పరీక్ష కేంద్రంలోనికి వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది పరీక్ష నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవాల పేరుతో మభ్యపెడుతున్న ప్రభుత్వం



జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అరెస్టు అయిన వివిధ పార్టీల నాయకులు

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని వివిధ పార్టీలకు చెందిన నాయకులు విమ్మర్శించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పెద్దపల్లి జిల్లాకు వస్తున్న సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి, పెద్దపల్లి రమేష్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సంబరాలు జరుపుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. ఉపాధి కరువైన ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, హైడ్రా పేరుతో పేద ప్రజల ఇండ్లు కూల్చడం, పెన్షన్ పెంపు పక్కన పడేయటం, రైతు భరోసా లేదు, రుణమాఫీ కాలేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

పోలీసుల ముందస్తు అరెస్టులు

సీఎం పెద్దపల్లి జిల్లాకు వస్తున్న సంధర్భంగా బుధవారం ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మండల నాయకులు మేడి తిరుపతి, హెచ్ఎంఎస్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, ధర్మ సమాజ్ నాయకులు గణేష్ మహరాజ్, పెద్దపల్లి రమేష్‌లను పోలీస్ స్టేషన్ తరలించారు.

మాల సామాజికవర్గం ఇప్పుడు గుర్తొచ్చిందా..?

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబం మూడు తరాలుగా రాజకీయాల్లో కొనసాగుతుండగా ఏనాడు గుర్తుకు రాని మాల సామాజికవర్గం ఇప్పుడు గుర్తుకొచ్చిందా.. అని బీఆర్ఎస్ మండల నాయకులు ప్రశ్నించారు. బుధవారం భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడిచిన 75 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉంటున్న వివేక్ వెంకటస్వామి కుటుంబం ఏనాడు మాల సామాజికవర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి మీద ఉన్న వ్యామోహంతో మాల సామాజిక వర్గాన్ని తెర పైకి తీసుకువచ్చి మాలల సింహగర్జన పేరుతో ఆ సామాజికవర్గంపై కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. మాల సామాజికవర్గానికి చెందిన వారిని రాజకీయంగా ఎదగనివ్వకుండా వారిపై పోటీ పడి ఓడించిన వివేక్ వెంకటస్వామికి ప్రత్యర్థి కూడా మా మాల సామాజిక వర్గం అనేది గుర్తుకు రాలేదా..? అని ప్రశ్నించారు. మాల సామాజికవర్గంపై వివేక్ వెంకటస్వామికి ఉన్న ప్రేమ ఇక్కడే కన్పిస్తుందని విమ్మర్శించారు. వర్గాన్ని చూపించాలని హైదరాబాద్‌లో సింహగర్జన ఏర్పాటు చేసిన వ్యక్తిగత ప్రయోజనం కోసం ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేకమని మాల సామాజికవర్గాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి సమ్మయ్య, ఆతుకూరి రాము, దాసరి మణి దీప్, తిరుపతి, జనంపల్లి తిరుపతి, వేల్పుల సతీష్‌మాదిగ, నిట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీ విషయంలో ఎల్ఐసీ ముందంజ

నవతెలంగాణ-మంచిర్యాల



దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రజలకు విశిష్ట సేవలతో భారతీయ జీవిత బీమా సంస్థ అగ్రగామిగా నిలిచిందని ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ రీజనల్ మేనేజర్ ఉతుప్ జోసఫ్ పేర్కొన్నారు. ఎల్ఐసీ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నవీకరించబడిన ఏజంట్ల శిక్షణా కేంద్రం ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక రంగం అందించిన నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకొని ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తోందని ఆయన తెలిపారు. పాలసీదారులకు విశిష్ట సేవలు అందించినందుకు గాను ఎల్ఐసీ సంస్థ ఎన్నో అవార్డులను పురస్కారాలను సొంతం చేసుకుందని తెలిపారు. కరీంనగర్ డివిజనల్ మేనేజర్ ఎస్వీ ప్రసాద్ రావు మాట్లాడుతూ డివిజన్ మొత్తంలో మంచిర్యాల బ్రాంచ్ శిక్షణ కేంద్రమే నవీకరణకు ఎంచుకోబడిందని, ఈ అవకాశాన్ని స్థానిక ఏజెంట్ మిత్రులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్కె శ్రీనివాస్, మంచిర్యాల బ్రాంచి ఛీఫ్ మేనేజర్ వి.విశ్వేశ్వర్, అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ కె. సత్యప్రసాద్, పి అనిత, సంజీవయ్య, నందిగామ శ్రీనివాసరావు, మల్లేష్, మార్కండేయ శర్మ, శశిశేఖర్, సీరపాణి, ఫణిరామ్మోహన్, నరేష్, అనోజ్, జగదీశ్వర్, రామదాస్, తిరుపతిరెడ్డి, శివరంజన్, పోచయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ వికాసానికి భారీగా తరలింపు

నవతెలంగాణ-తాండూర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా పెద్దపల్లిలో యువ వికాస కార్యక్రమానికి మండలం నుండి స్వయం సహాయక బృందం సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి బయలుదేరిన బస్సులను తాండూర్ మండలాధ్యక్షుడు ఈసా జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఏపీఎం నందకుమార్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట : పెద్దపల్లిలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువవికాసం బహిరంగ సభకు మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా కాసిపేట 2 ఇంక్లైన్ గని ఐఎన్‌టీయూసీ నాయకులు తరలివెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో గని ఫిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చింతం రవికిరణ్, సీనియర్ నాయకులు అల్లం స్వామి రాజమౌళి, నక్క హరీష్, దేవేందర్ యువ నాయకులు రెమ్మ నిశాంత్, రెక్కల తిరుపతి, బామాండ్లపల్లి తిరుపతి, నెల్క సురేష్, ఈర్ల వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, తేజ, రవికుమార్ ఉన్నారు.



కాసిపేటలో..

పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువు

- భీమారం వ్యవసాయ అధికారి సుధాకర్



నవతెలంగాణ-జైపూర్

భూసార పరిరక్షణ కోసం పంట వ్యర్థాలను కాల్చకుండా పంట పొలంలో కలియ దుండడంతో సహజంగా సేంద్రియ ఎరువు తయారవుతుందని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం పోతనపల్లి శివారు రైతులతో మాట్లాడుతూ వారి పంట కాలం పూర్తి కాగా పంట పొలంలో మిగిలిపోయిన మరి కొయ్యలను కాల్చకుండా పంట పొలంలో కలియ దున్నాలని తెలిపారు. ఫలితంగా భూసారాన్ని తెలుసుకోవడంతో పాటు పర్యావరణానికి విఘాతం కలగకుండా ఉంటుందని అన్నారు. యాసంగి వరి పంటలు సాగు చేసే ముందు మడులను నీటితో తడిపి ఎకరానికి 50కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల యూరియా చల్లి పొలాన్ని కలియదున్నాలని సూచించారు. ఈ విధంగా పంట పొలాల భూసారాన్ని పెంచుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించి పంటల సాగు లాభసాటిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్, పోతనపల్లి శివారు రైతులు పాల్గొన్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆరు బోర్ వెల్స్ పనులను ప్రారంభించారు. వేసవిలో ఏర్పడే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ఓరియంట్ కంపెనీ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన గత్రాప్‌పల్లి గ్రామ పంచాయతీలోని తుడుంగూడ, గత్రాప్‌పల్లి, ఇప్పలగూడెం, సాలేగూడలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యలో బోర్ వెల్స్ మంజూరు కాగా తుడుంగూడలో ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ చేతుల మీదుగా గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ ఆరు బోర్ వెల్స్‌ని సీఎస్ఆర్ నిధులతో చేపట్టినట్లు వివరించారు. రెండు రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని సివిల్ డిపార్ట్మెంట్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లో కలిసిన మాలమహానాడు నాయకులు బుధవారం శాలువాతో సన్మానించారు. ఇటీవల చేపట్టిన మాలల సింహగర్జన బహిరంగ సభ విజయవంతం కావడానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల లచ్చన్న, చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షుడు శీలం వెంకటేశం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ శశికళ అన్నారు. బుధవారం మండలంలోని రోటిగూడా, తదితర గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు.

అభయారణ్యాన్ని తిలకించిన యూట్యూబ్ అంజి మామ టీం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ అభయారణ్యాన్ని యూట్యూబ్ అంజి మామ టీం సభ్యులు తిలకించారు. బుధవారం ఉదయం వారు మండలంలోని గోండుగూడా అటవీ ప్రాంతంలో అభయారణ్యం, వన్యప్రాణులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయనకు అటవీ అధికారులు అభయారణ్య విశిష్టత గురించి వివరించారు. అభయారణ్య ప్రకృతి అందాలు బాగున్నాయని అంజిమామ అన్నారు.

8న కొలాం సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు

నవతెలంగాణ-కాసిపేట

కోలాం సేవా సంఘం జిల్లా కమిటీని ఈ నెల 8న ఆదివారం ఉదయం 10:30 గంటలకు బొక్కలగుట్టలో ఎన్నుకోవడం జరుగుతుందని జిల్లా కోలాం సేవా సంఘం నాయకులు ఆత్రం మహేశ్, సిడం భీంరావు, టేకం రాజు, ఆత్రం మారు, సిడం గంగారాం, కొడప అనంతరావు, ఆత్రం రాజు ప్రకటనలో పేర్కొన్నారు. కోలాం జిల్లా కమిటీ ఎన్నికకు జిల్లాలోని కోలాం సంఘం నాయకులు, పెద్దలు, గ్రామ పటేళ్లు, యువతీ, యువకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | డిసెంబర్ 5, 2024 | www.navatelangana.com

నాక్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంటోనీ పాఠశాలను మండల విద్యాధికారి రమేష్ బాబు బుధవారం పరిశీలించారు. సెయింట్ ఆంటోనీ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులు 17 మంది, కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులు 18 మంది నాక్ పరీక్షకు హాజరు కాగా పరీక్ష రాస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాల రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గణేష్ బిశ్వాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్టీసీ డిపోలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కవి మాడిశెట్టి శ్రీనివాస్‌ను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రచించిన 'నువ్వు నేను గోదారి' కవిత పుస్తకాన్ని డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో కలిసి కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ఎంతో పని ఒత్తిడి ఉన్న శ్రీనివాస్ రచించిన పుస్తకం ఎంతో బాగుందన్నారు. కవితలు పాటలాంటి ఇతరత్రా పనుల వల్ల పని ఒత్తిడి నుంచి కొంత దూరమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సైబర్ మోసాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం బలగల మైనార్టీ గురుకులం-2లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు పెరగుతున్నాయని, విద్యార్థులు ఈ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షగుఫ్తా, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీలు ఎన్నిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీఎస్‌యూటీఎఫ్ తిర్యాణి, లింగాపూర్ మండల కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, ఇందూరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిర్యాణి మండల అధ్యక్షులుగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కృష్ణారాథోడ్, మాధురి, కోశాధికారిగా వెంకట్, కార్యదర్శులుగా రమ్య శ్రావణ్, పెంటయ్య, మహిళా కమిటీ కన్వీనర్‌గా మంజులను ఎన్నుకున్నారు. అదేవిధంగా లింగాపూర్ మండల అధ్యక్షునిగా కైలాష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా గోపి, వర్ణ, కార్యదర్శులుగా సుజాత, సాయినాథ్, మహిళా కమిటీ కన్వీనర్‌గా అరుణ లను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా కమిటీ అభినందించింది.

మొబైల్ అందజేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరి చేసిన మొబైల్ ఫోన్‌ను బాధితునికి అప్పగించినట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. స్టేషన్ పరిధిలో ఫోన్‌ని పోగొట్టుకున్న పైడి నానాజీ అనే వ్యక్తి ఆధార్ కార్డు, సంబంధిత మొబైల్ ఫోన్ల నెంబర్లను వెబ్‌సైటులోకి అప్లోడ్ చేసి బ్లాక్ చేసి సిమ్ కార్డు వేసిన అతని వివరాలు తెలుసుకొని అతని నుండి మొబైల్‌ను రికవరీ చేసి బాధితునికి అప్పగించామన్నారు.

ఐక్యంగా అధికారులు ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐక్యంగా ఉండే అధికారులు ముందుకు సాగాల్సిన అవసరం ఉంటుందని తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సాల్మన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా అదనపు వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికకు ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్ సభ్యుడు అనిల్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు సమస్యలు వచ్చినపుడు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు అండగా వారి సమస్యలు పరిష్కారం కోసం కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షునిగా మిలింద్ ఎంపిక

తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ గా శ్రీనివాసరావు ఎంపిక కాగా, అధ్యక్షునిగా మిలింద్, జనరల్ సెక్రెటరీగా యుగేందర్, జాయింట్ సెక్రెటరీగా నాగరాజు, ట్రెజరర్ గా మంజుల, ఉపాధ్యక్షురాలుగా ప్రేమలత, రాష్ట్ర ఈసీ సభ్యునిగా గోపికాంత్, గిరీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని లోనవెల్లిలోని దుబ్బగూడా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్ సందర్శించారు. రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యలయంలో జరుగుతున్న సర్వే డేటా ఎంట్రీను పరిశీలించి నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తరామ్, తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, సీసీ రాజేష్ ఉన్నారు.

ఖాళీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగారిగూడలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో టీజీటీ గణితం ఖాళీ పోస్టుని గంటల బోధన ప్రతిపాదికన ఉద్యోగ భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థి టీజీటీ గణితం కోసం డిగ్రీ, బీఎడ్ పూర్తి చేసి, టెట్‌లో అర్హత ఉండలన్నారు. దరఖాస్తులను ఆదర్శ పాఠశాలలో ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు చేసుకోవచ్చని సూచించారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అటవీ సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మావల హరిత వనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి డీఎఫ్ఓ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డీఎఫ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాడిన రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతుందని, అందులోనే భాగంగా ఆయా శాఖలు కూడా మరింత అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. వనమహోత్సవంలో అటవీ శాఖకు ఇచ్చిన లక్ష్యం 44 లక్షల 17 కాగా 44 లక్షల 56 వేల మొక్కలను నాటడం జరిగిందన్నారు. అటవీ శాఖ నర్సరీలను కూడా మరింత అధుకరించి మొక్కల పెంపకాన్ని పెంచడం జరిగిందన్నారు. 150 హెక్టర్ల భూమి అక్రమణ నుంచి తిరిగి తీసుకోవడం జరిగిందని తెలిపారు. అటవీ జంతువుల వల్ల నష్టపోయిన వారికి జిల్లాలో ఈ సంవత్సరం రూ. 3 లక్షల వరకు పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా వచ్చేది ఎండ కాలమని అటవీలో నిప్పు పెట్టొదని దాని వల్ల అటవీ పూర్తిగా దగ్ధం అయ్యే ప్రమాదం ఉంటుందని ప్రజలు సహకారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఓ గులాబ్ సింగ్, సెక్షన్ ఆఫీసర్ అహ్మద్ ఖాన్, రేంజ్ స్టాఫ్, బెస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



పులులకు ఎలాంటి హాని కలిగించొద్దు

ఆదిలాబాద్ కవ్వాల్‌ను టైగర్ కారిడర్గా గుర్తించారని, పులులు చలి కాలంలో తన భాగస్వామి కోసం అటవీలో తిరుగుతాయని వాటికి ఎలాంటి హానీ కలిగించోద్దని డీఎఫ్ఎ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వారం పది రోజులుగా ఉమ్మడి జిల్లాలో పులల సంచారం పెరిగిందన్నారు. ఆదిలాబాద్ పక్కనే తిప్పేశ్వర్, తడోబా అటవీ ప్రాంతం ఉండడంతో అక్కడి నుంచి పులలు వస్తున్నాయన్నారు. తెలంగాణలో పులులు రావాలంటే ఆదిలాబాద్ నుంచే ప్రవేశించాల్సి ఉంటుందని, అందుకే ఈ ప్రాంతం డోర్ ఆఫ్ టైగర్ కూడా అభివద్ధి చెందే అవకాశాలుంటాయన్నారు. తడోబా సంవత్సర ఆదారం రూ.150 కోట్లు పులల కేంద్రం ద్వారా సాధిస్తుందన్నారు. అదే పులులు ఇక్కడి వస్తే పర్యటక కేంద్రంగా మరి కనీసం రూ.75 కోట్ల రెవెన్యూ అటవీ శాఖ వస్తుందన్నారు. పులులు భాగస్వామితో పాటు ఆవాసం ఏర్పాటుకు చలి కాలంలో తిరుగుతూ ఉంటాయన్నారు. ఒకటి రెండు నెలలుండి వెళ్లిపోతాయన్నారు. కాగజ్‌నగర్‌లో జరిగిన ఘటన విచారకమన్నారు. ప్రస్తుతం పత్తి ఎరేందుకు పులి భయంతో కూలీలు రావడం లేదని తెలిసిందన్నారు. అటవీ శాఖ సూచనలు పాటించాలన్నారు. పత్తి ఎరే సమయంలో ఒకరు శబ్దం చేస్తు చుట్టూ ఉండాలని, పులి వచ్చిన శబ్దానికి అక్కడ అగదన్నారు. ఏ ఉరిలోనైన పులి కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎం) నాయకులు బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయని, రోడ్లు వెడల్పు లేకపోవడంతో రహదారులపై నడవలేని పరిస్థితి ఉందన్నారు. చిన్న పాటి వర్షం వస్తే నీరు ప్రవహించే మార్గం లేక ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని, మార్కెట్‌లో వ్యాపారవర్గాల వారు రోడ్డు మీదికి వచ్చి దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నందున చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, సుదర్శన్, సాయికృష్ణ, అంగల శ్రీనివాస్, సుంకరి సాయికృష్ణ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో బుధవారం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అర్హులైన 78 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది పూర్తి చేసుకున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోయామన్నారు. దింద బ్రిడ్జి, గూడెం రోడ్డు వేయాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరి, ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చించినప్పుడు అటవీ శాఖ అనుమతులకు రూ.12 కోట్లు అటవీ శాఖకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునవర్ షరీఫ్, నాయకులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గణపతి,



నాయకులు దుబ్బుల నాన్నయ్య, బసర్కర్ శ్వనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, ఎల్ములే మల్లయ్య, తుకారాం, మురళి, పురుషోత్తమ చారి, చాపల సుధాకర్, భీంకరి నారాయణ ఉన్నారు.

7న రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 7న నిర్వహించే రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి బందుకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, క్యాబ్, టాక్సీ డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్లకు రూ.10లక్షలు ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగం, భూమి ఇవ్వాలన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలన్నారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన రవాణారంగా ఆటో, క్యాబ్, టాక్సీ రవాణా రంగ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏడున చేపట్టే బందులో పెద్ద ఎత్తున ఆటోవాలాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకురి చిరంజీవి, ఆసిఫాబాద్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ అస్లాం ఖాన్, జన్కాపూర్ ప్రెసిడెంట్ రఫిక్, లక్ష్మన్, బాలాజీ, సాదిక్, ప్రవీణ్, జమీల్, ఈర్షద్, సలీం, ఫిరోథ్ ఖాన్ పాల్గొన్నారు.

సీనియర్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా పాఠశాల మైదానంలో 71వ సీనియర్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. పోటీలను ప్రారంభించడానికి ఏసీఎం పుర్క ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ పోటీలో రాణించి రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. కబడ్డీ జిల్లా ఇన్‌చార్జి నిర్వాహకుడు ఆత్రం ధర్మారావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన కబడ్డీ జట్టు ఈనెల 7 నుండి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుద్మేత జంగు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సాయిబాబా, సీఆర్పీ రవీందర్, జాయింట్ సెక్రెటరీ ఆత్రం లింగారావు, కడ్తల రాకేష్, లక్ష్మి, కొత్త లక్ష్మి, జయ, హాండ్ బాల్ కోచ్ అరవింద్,



కబడ్డి కోచ్ చంద్రశేఖర్, సోమేష్, సెడ్మారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించలని గ్రామస్తులు కోరారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల ముందు రక్షణ కంచే లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల గతంలో పశువులతో పాటు మేకలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయన్నారు. పాఠశాలకు వచ్చే చిన్నపిల్లలు అనుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్తే ప్రమాదం జరిగే ఆస్కారం ఉందన్నారు. వెంటనే ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుండి తొలగించాలని కోరారు. కలెక్టర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పరిశుభ్రంతో పాటు నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ముందర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-కౌటాల

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కాగజ్‌నగర్ ఏఏఓ రాజమల్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను పరిశీలించి సకాలంలో బిల్లు చెల్లించని వారి కనెక్షన్లను తొలగించారు. ప్రతి ఒక్కరు సకాలంలో చెల్లించడం వలన అదనపు వడ్డీ భారం తగ్గుతుందన్నారు. ఆయన వెంట ఫోర్‌మెన్ నర్సింగరావు, ఎల్ఎంలు లక్ష్మణ్, సుధాకర్, సిబ్బంది సుధాకర్, పెంటన్న ఉన్నారు.

వివరాల కంప్యూటరీకరణ త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక , విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కేంద్రాన్ని బుధవారం డీపీఓ భిక్షపతి గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ డాటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలన్నారు. అదనపు కంప్యూటర్‌లను సమకూర్చి ఆపరేటర్‌లను తీసుకొని త్వరగా అయ్యేల చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ ఎండీ. రియాజ్ ఆలీ, ఎంపీఓ జావీద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-సిర్పూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థి ఎంఈ బాబర్ బేగ్ 68వ జాతీయస్థాయి ఎజ్జీఎఫ్ అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 8 నుండి 10 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని, ఈ నెల 10 నుండి 12 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంఈ బాబర్ బేగ్ ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సుమన్, టీ.గణేష్, పీడీ రఘు, పీఈటీ సుధాకర్, అధ్యాపకులు అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటాం

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మీర్యాల రాజిరెడ్డి

నవతెలంగాణ-రెబ్బెన

కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటామని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. గోలేటిలోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల బెల్లంపల్లి ఏరియా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించే విధంగా మినిమం వేజెస్ పెంపుకు కృషి చేస్తామని, చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన అన్ని హక్కుల సాధన కోసం తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్ట్ కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఏంబాల ఓదెలు, నాయకులు శ్రీనివాసరావు, మంగిలాల్ వెంకటేష్, చంద్ర శేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య, ఓరం కిరణ్, సంపత్, పిట్ సెక్రటరీ రమేష్, గణపతి మారిన చందర్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ పట్టణంలోని చించోలి అర్బన్ పార్క్‌లో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల వన్యప్రాణుల దాడుల వల్ల పశు సంపదకు జరిగిన నష్టపరిహార చెక్కులను బాధితులకు బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానన్ అందజేశారు. అనంతరం అటవీ రక్షణ, అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ అధికారి నాగిని భాను, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సొనాలలో భవనాల పరిశీలన

నవతెలంగాణ-బోథ్



సొనాలలో మండలం ఏర్పాటుకు బుధవారం తహసీల్దార్ సుభాష్‌చందర్, ఎంపీడీఓ రమేష్ భవనాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం కొరకు పాత జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయం కొరకు ఎస్సీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. మరిన్ని కార్యాలయాల కొరకు భవనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో జీవన్‌రెడ్డి, ఆర్ఐ సునీత, ఎంసి బాపురావ్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. బుధవారం పట్టణంలోని లైబ్రరీలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు 54 కోర్సులకు సంబంధించిన ఉచిత యాప్‌ను జిల్లా ఇన్చార్జి గోనే రవి, మల్లారెడ్డి అందించి రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అండగా ఉండాలని ఉచితంగా స్టడీ మేటిరియల్‌తో పాటు ఉచితంగా యాప్‌ను కూడా ఇస్తున్నారన్నారు. గతంలో కుర్చీలు, స్టడీ ప్యాడ్లు, మంచి నీటి కోసం ట్యాంక్ కూడా ఇచ్చామన్నారు. అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

మానసిక ప్రశాంతత కోసమే యోగా



నవతెలంగాణ-బోథ్

మానసిక ప్రశాంతత కోసమే యోగా అని శిక్షకురాలు మునిగెల యోగిత అన్నారు. బుధవారం మండలంలోని మర్లపెల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షా సమయంలో మానసిక ఆందోళనగా కలగకుండా యోగాలో ప్రాణాయామం, యోగాసనాలు, ముద్రలు పరిచయం చేస్తున్నారన్నారు. పిల్లలు ఫోన్‌కు దూరంగా ఉండేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. మంచి మార్గంలో వెళ్లేలా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. గర్భిణులు సహజ ప్రసవం జరిగేలా యోగా ఆసనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు లక్మణ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-బోథ్

మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ మాట్లాడుతూ బోథ్‌లో చలి తీవ్రత ఎక్కువ ఉంటుందని, దీన్ని తట్టుకోవడం వృద్ధులకు కష్టంగా ఉంటుందని రక్షణ కొరకు అమ్మ మాసం లక్ష్మీ, అన్న మాసం కిరణ్ జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల ఫోటో గ్రాఫర్ సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ వార్డ్ సభ్యులు ఎనుగంటి రవి, అపర్ణ, భవన కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కరిపే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో దొంగతనం

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని శ్రీకర్ మార్ట్‌లో బుధవారం సాయంత్రం రూ.5.97లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. గమనించిన శ్రీకర్ మార్ట్ యజమాని స్వరాజ్ దుండంగులను చూసి వెంబడించగా పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై దివ్యభారతి తమ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. విషయం తెలుసుకున్న సీఐ సాయినాథ్ పోలీస్ సిబ్బందితో కలిసి శ్రీకర్ మార్ట్‌లో ఉన్న సీసీ పుటేజిలను పరిశీలించారు. మార్ట్ యజమాని ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

నిర్మల్ వాసికి డాక్టరేట్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన కత్రోజి కిషోర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'స్ట్రక్చరల్ మాపింగ్ బై రిమోట్ సెన్సింగ్ అండ్ మాగ్నేటిక్ మెథడ్స్ ఇన్ పార్ట్స్ అఫ్ సూర్యాపేట అండ్ నల్గొండ రీజియన్స్ అఫ్ తెలంగాణా స్టేట్ ఇండియా' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయలక్ష్మి పర్యవేక్షణలో పూర్తి చేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని వరలక్ష్మీనగర్ కాలనీకి చెందిన అబ్దుల్ సమద్ కుమారుడు అజీమ్ కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి బుధవారం ఇంటికెళ్లి ఆర్థికసాయం చేశాడు. కార్యక్రమంలో డాక్టర్ రహీం, సురేందర్‌రెడ్డి, సవీన్‌రెడ్డి ఉన్నారు.

కూతురు వివాహానికి పీఎం మోడీకి ఆహ్వానం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దంపతులు బుధవారం దేశ ప్రధాని నరేంద్ర మోడీని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 11న జరిగే తమ కూతురు వివాహానికి హాజరుకావాలని ప్రధానికి వివాహ పత్రికను అందజేశారు. అనంతరం శాలువాతో ప్రధానిని సత్కరించారు.

కుటుంబ భావన కలగడానికే వనభోజనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరిలో కుటుంబం అనే భావన రావాలన్న ఉద్దేశంతో సంస్థ వనభోజనాల మహోత్సవాన్ని నిర్వహిస్తోందని డిప్యూటి ఆర్ఎం ఆపరేషన్ ప్రణీత్ అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన వనభోజనాల మహోత్సవాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరు ఒక చోట చేరి కుటుంబ సభ్యులతో ఆడిపాడి భోజనాలు చేయడంతో ఒకే కుటుంబం అన్న భావన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శంకరయ్య, డిఎం కల్పన, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ప్రమీల, ఎంఎఫ్ శ్రీకార్, రిజర్వేషన్ ఇన్చార్జి సయ్యద్ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజా పాలనలో సమస్యలెందుకు..?



నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో సమస్యలు ఎందుకు వస్తున్నాయని బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పేదింటి బిడ్డలు కూడా ఉన్నత స్థాయి చదువులు చదవాలనే ఆలోచనతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో వెయ్యి గురుకులలను ఏర్పాటు చేశారన్నారు. నాణ్యమైన విద్యతో పాటు ఆహారం అందించి 10 ఏండ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల్లోనే 52 మంది విద్యార్థుల ప్రాణాలను పొట్టన పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమని, ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు శివకుమార్, ప్రశాంత్, సయ్యద్ ఖాసీం, రాథోడ్ శివాజీ, ఆత్రం జంగు, ఫెరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ మోసం



నవతెలంగాణ-సిరికొండ

రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బిజెపి మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమూల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా అర్హులైన రెండు లక్షల లోపు ఉన్న రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి రుణ మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే రుణమాఫీ చేయాలని తెలిపారు. రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, రాబోయే సర్పంచ్ ఎన్నికల ముందు కొత్త నాటకానికి తెరలేపిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చామని గొప్పలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో బిజెపి మండల నాయకులు బాలాజీ, ప్రహ్లాద్, గంగాధర్, గోవింద్, జంగు, సోంనాథ్ పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఖండించాలి



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందువులపై దాడులు జరగడం బాధాకరమని, దీన్ని ప్రతి ఒక్క హిందువు ఖండించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు సంఘీభావంగా హిందూ ఐక్య సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దాడి ఖండిస్తు నినాదాలు చేస్తు బంగ్లాదేశ్ తన చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతున్నాయని, దీన్ని ప్రతి ఒక్క హిందువు ఖండించాలన్నారు. బంగ్లాదేశ్ ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలిపితే హిందువులు అది బీజేపీ కార్యక్రమాన్ని రావడం లేదన్నారు. రాజకీయాలు వేరు హిందువులపై దాడులు వేరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో గోపాకృష్ణమఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి, బీజేపీ నాయకులు బ్రహ్మానంద్, సుహాసినిరెడ్డి, హిందూ ఐక్య సమితి నాయకులు బొంపెల్లి హన్మండ్లు, ధార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులకు మద్దతుగా ర్యాలీ

ఆసిఫాబాద్ : బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని వారికి మద్దతుగా జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి, అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను పై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మైనారిటీలుగా ఉన్న హిందువులను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రెగుంట కేశవ్ మాదిగ, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, హిందూ ఐక్యవేదిక సభ్యులు కోటేశ్వర్, కంద్రే విశాల్, గడ్డల కరణ్, సైదం నాగరాజు, గణేష్, ఆంజనేయులు, శ్రీకాంత్, కపల్, సంతోష్, గుర్రాల వెంకటేశ్వర్లు, హరిప్రియ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అబద్ధం

నవతెలంగాణ-ముథోల్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అబద్ధమని ముథోల్ నియోజకవర్గం బీజేపీ ప్రొగ్రాం ఇన్‌చార్జి రాజేష్ బాబు, మండల నాయకులు నర్సాగౌడ్ అన్నారు. కాంగ్రెస్ 6 అబద్ధాలు 66మోసాలపై పార్టీ ఆధ్వర్యంలో చార్జిషీట్‌ను బుధవారం విడుదల చేశారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇండ్లు, యువ వికాసంతో పాటు ఆయా పథకాలను సీఎం అమలు చేయడ లేదని ఆరోపించారు. అబద్ధం కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి తర్వాత మర్చిపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. గురువారం భైంసాలో పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, నాయకులు దత్తాద్రి, శ్యాంరావు, రాంచందర్, భూమన్న, గడ్డెన్న, ధర్మపురి శ్రీనివాస్, అంబర్ సింగ్, ముత్యం పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5న గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్ -19 జిల్లాస్థాయి బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కి రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల నుండి ముగ్గురు పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు 7702035200 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఈ నెల 6న బహిరంగ విచారణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమీషన్ వెనుకబడిన తరగతుల కులం, కుల సంఘాల ప్రతినిధుల నుండి స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో ఆసక్తి గల అభ్యర్థుల నుండి సమర్పణలు, అభ్యర్థనలు, ఆక్షేపణలు స్వీకరించేందుకు ఈ నెల 6న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ కులస్తులు, కుల సంఘాల నాయకులు ఈ బహిరంగ విచారణకు హాజరై తమ సమర్పణలు, అభ్యర్థనలు, ఆక్షేపణలు, సలహాలను సమర్పించాలని తెలిపారు.

విజయోత్సవాలపై కళాజాత ప్రదర్శన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో డీపీఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో కళాజాత బృందం మోహన్ నాయక్ అధ్యక్షతన గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తుంది. బుధవారం మండలంలోని అడ గ్రామంలో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన పలు హామీలను నెరవేర్చిన విధానాన్ని పాటల రూపంలో ప్రజలకు కళ్ళకు కట్టినట్టు చూపించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచారం సాగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లు ప్రమాదంలో యజమాని మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



విజయలక్ష్మీ జిన్నింగ్ మిల్లులో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో యజమాని పరమేశ్వర్(58) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..పరమేశ్వర్ మిల్లు పర్యవేక్షణలో భాగంగా బెల్టుల పని తీరు పర్యవేక్షిస్తుండగా ప్రమాదవశాత్తు చేయి ఇరుక్కుపోయి ఛాతి వరకు తీవ్ర గాయాలయ్యాయి. కార్మికులు చూసే సరికే తీవ్ర రక్తస్రవమై తుది శ్వస విడిచాడు. జిన్నింగ్ మిల్లు యజమాని మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాడిహత్నూర్ బ్రాంచ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు అందించే సేవలను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే బీమా పథకాలను వివరించారు. దీంతో పాటు డిజిటల్ బ్యాంక్ సేవలను మహిళకు అందించే వివిధ రుణాలు, రైతులకు అందించే క్రాప్ లోన్ గురించి తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సునీల్, గంగోలి, సీఎస్పి నిర్వాహకులు రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలిరాం, పాఠశాల సిబ్బంది పరమేశ్వర్, రామేశ్వర్, సతీష్ పాల్గొన్నారు.

బండు పటేల్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రాజంపేట్ గ్రామానికి చెందిన బండుపటేల్ ఇటీవల పాము కాటుకు గురయ్యాడు. వారం రోజులుగా రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు. మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ రంజాన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచం లక్ష్మణ్, ప్రకాష్, రషీద్, మోబిన్, సంతోష్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన మహిళా సంఘాల సభ్యులు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు బుధవారం పెద్దపల్లిలో నిర్వహించ తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలివెళ్లారు. స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏపీఎం రాజకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో స్వయం సహాయక సంఘాల సభ్యులను భారీగా తరలించారు. జన్నారం : పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాసంసభకు, మండలం స్వయం సహాయక మహిళలు బస్సులలో తరలి వెళ్లారు. ఈ సభలో మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నరుణాలపై వివరించనున్నట్లు ఎంపీడీఓ శశికళ తెలిపారు. మండల కేంద్ర నుంచి రెండు ఆర్టీసీ బస్సులలో పెద్దఎత్తున మహిళలు తరలి వెళ్లారు.

ఇందన్‌పల్లి, చింతగూడలో భూ ప్రకంపనలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇందన్‌పల్లి చింతాగూడ గ్రామంలో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. బుధవారం ఉదయం గ్రామంలో రెండు సెకన్ల పాటు భూమి పంపించిందని స్థానికులు తెలిపారు. భూ ప్రకంపనలను గుర్తించిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భూ ప్రకంపనలు నమోదు కావడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. అలాగే పలు గ్రామాల్లో కూడా భూ ప్రకంపనాలు నమోదయ్యాయనే వార్తలు వస్తున్నాయి. భూ ప్రకంపనలతో ఎటువంటి నష్టం జరగలేదు. ఏది ఏమైనా ప్రజలు ఎలాంటి బాయా ఆందోళనకు గురికాకుండా అప్రమత్తంగాఉండాలని అధికారులు సూచించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా గుండ శ్యామ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా శ్యామ్ ఎన్నికయ్యారు. మూడు సంవత్సరాల క్రితం మొదటిసారి అధ్యక్షునిగా ఎన్నిక కాగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి తన పదవికి రాజీనామా చేసి కార్పొరేషన్ చైర్మన్‌గా వెళ్లడంతో జిల్లాల కమిటీల ఎన్నికలు అనివార్యమయ్యాయి. దీంతో జిల్లాలో అధ్యక్షునిగా మరోసారి శ్యామ్ బరిలో నిలువగా ప్రత్యర్థిగా శివరాం నాయక్ పోటీపడ్డ బుధవారం ప్రకటించిన ఫలితాల్లో గుండాశ్యామ్ మరోసారి విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మండల అధ్యక్షుడు చరణ్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షునిగా కమల్‌నాథ్ రెడ్డి ఎన్నికయ్యారు.

వైభవంగా అయ్యప్ప చక్రస్నానం

నవతెలంగాణ-తాంసి

అయ్యప్ప చక్రస్నాన మహోత్సవాన్ని బుధవారం సుంకిడి అయ్యప్ప హరిహర క్షేత్ర దేవస్థాన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అయ్యప్ప విగ్రహాన్ని పల్లకితో గ్రామ వీధుల్లో అయ్యప్ప భక్తుల అయ్యప్ప శరణు ఘోషరులతో భజన కీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. మత్తడివాగు ప్రాజెక్టు ప్రాంతానికెళ్లి అయ్యప్పను గంధం పసుపుతో అలంకరించి అలయ పూజారులు గురు స్వాములు పూజలు నిర్వహించి ప్రాజెక్టు ప్రాంతంలో చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో గురు స్వాములు శ్రీనివాస్, సతీష్, రాములు, పోచ్చన్న, నరేష్, స్వామి, వివిధ గ్రామాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు.